క్లుప్తంగా

ప్రారంభమైన ఉరుసు



హజరత్ జమాలుల్లా బాబా దర్గా

రాయచోటి : పట్టణంలోని పాతరాయచోటిలో ఉన్న హజరత్ జమాలుల్లా బాబా దర్గా ఉరుసు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గాలోని బాబా మజార్లతో పాటు దర్గా ఆవరణాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. పాతరాయచోటి పీర్లమకాన్ నుంచి జెండాను ఊరేగింపుగా తీసుకువచ్చి దర్గాకు చేర్చారు. అనంతరం గంధోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని నేడు ఉరుసు మహోత్సవం జరగనుంది. గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు హిందూ మహమ్మదీయ సోదరులను కోరారు.

మట్టి సేకరణ

సంబేపల్లి : మేరీ మిట్టి.. మేరా దేశ్ (అమృత్ కలశ్) కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ రవీంద్రనాథ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం స్థానిక సర్పంచ్ చంద్రయ్యతోపాటు కలిసి పుట్టమట్టిని సేకరించారు. అనంతరం సేకరించిన మట్టిని అన్నమయ్య జిల్లా కేంద్రానికి పంపుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మహిజ, వలంటీర్ రెడ్డప్ప పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

సిద్దవటం : గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న తెలిపారు. సిద్దవటం మండలంలోని మంగనవాండ్లపల్లె గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించి, పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు సుధారాణి, అంగన్‌వాడీలు లక్ష్మిదేవి, మునెమ్మ, షమీన, మాదవి, విజయ, సిద్దవటం సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

రామాపురం : మండలంలోని నీలకంట్రావుపేటలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైనటువంటి బి.రాచపల్లె ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఆదిమూలం రామచంద్ర, పాలన్నగారిపల్లె ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎ.వెంకట్రామిరెడ్డిలకు స్కూల్ కాంప్లెక్స్ ట్రెనింగ్ ప్రోగ్రాం నందు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు, కాంప్లెక్స్ సెక్రటరీ మనోహర్ ఆధ్వర్యంలో ఎంఈఓలు, ఉపాధ్యాయులందరూ కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, జయచంద్ర, ఉపాధ్యాయులు రఫీ, నరసింహారెడ్డి, రమేష్‌రెడ్డి, ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ర్యాలీ

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డయ్య ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్పంచ్ సుజాత, ఈఓపీఆర్‌డీ రంగయ్య, పంచాయతీ కార్యదర్శి రమణరెడ్డి, ఒంటిమిట్ట సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీపీఎస్‌పై ఉద్యోగుల నిరసన

ఒంటిమిట్ట : అసెంబ్లీలో జీపీఎస్ బిల్లును బుధవారం ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టడంతో ఒంటిమిట్ట మండల కేంద్రంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు జీపీఎస్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా డబ్బుతో మీరు ఇచ్చే జీపీఎస్ మాకొద్దని, హామీ ఇచ్చిన ఓపీఎస్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ముళ్లు తీసి జీపీఎస్ మేకును మా హృదయాల్లో గుచ్చారన్నారు. జీపీఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం దుర్మార్గపు చర్య అన్నారు. భవిష్యత్‌లో జీపీఎస్ చట్టం రద్దు, పాత పెన్షన్‌ను సాధించడం కోసం కలిసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాలను కలుపుకొని పోరాటాన్ని కొనసాగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు రాజేంద్రప్రసాద్, హరినాథ్‌రెడ్డి, అవ్వారు పెద్దరెడ్డెయ్య, తిరుపాలయ్య, ప్రభూషన్, ఖదీర్ అహ్మద్, అగస్టీన్‌బాబు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సిద్దవటం సీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ వైద్య సేవలు

సిద్దవటం : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం డాక్టర్ మధుశేఖర్ పర్యవేక్షణలో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ రవి దీర్ఘకాలిక నొప్పులు, కీళ్లవాతం, నడుము నొప్పులు ఉన్నవారికి చికిత్సను అందించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్ వైద్యుడు రవి మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న పేషెంట్లకు శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. అందులో భాగంగా మోకాళ్ల నొప్పులకు, నడుము నొప్పులకు, వెన్నుపూస నొప్పులతో బాధపడుతున్న పేషంట్లకు చికిత్స అందిస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇక్కడ క్యాంపు చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు తెలియజేశారు.

జగనన్నకు చెబుదాంకు వినతుల వెల్లువ

- వినతులను పరిశీలించిన జేసీ
- సమస్యల పరిష్కారం దిశగా అడుగులు
- జేసీ అహ్మద్‌ఖాన్‌ను సన్మానించిన నేతలు



రాజంపేట: జేసీ అహ్మద్‌ఖాన్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

నందలూరు(రాజంపేట) : నందలూరు ఎంపీపీ క్యాంపస్‌లో బుధవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతుల వెల్లువెత్తింది. సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ స్వయంగా వినతులను పరిశీలించారు. వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల విన్నపాలను నేరుగా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ విన్నారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి సమక్షంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సేవలలో స్థానికంగా తలెత్తుతున్న లోపాలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతం ఎంపీపీ మేడా ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌ను జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, మైనార్టీ నాయకుడు నవాబ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు జంబు సూర్యనారాయణ, అక్కిరెడ్డి స్వరూప, మైనుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓర్సు శ్రీను, సోమిశెట్టి ప్రభాకర్, హిమగిరి యాదవ్, యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి, ఆకేపాటి రమేష్‌రెడ్డి, దళితనాయకులు ఆర్ముగం విశ్వనాథ్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, కోనాపురం విజయ్, పణతల రామచంద్ర పాల్గొన్నారు.

■ పాటూరు ఎస్సీ కాలనీలో ఇంటి పట్టాలు, కరెంట్ సౌకర్యం, ఎర్రిపాపయ్యగారిపల్లె, జగడాపల్లె ఎస్సీ కాలనీ విద్యుత్ స్తంభాలు వేశారు. వైరింగ్ ఇవ్వలేదన్నారు. పాటూరు అంగన్‌వాడీ, వెటర్నరీ హాస్పిటల్, ఎలిమెంటరీ స్కూళ్లకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని సర్పంచ్ స్వరూప కోరారు.

■ కోనాపురం, కొమ్మూరు గ్రామాలకు సంబంధించి 150 కుటుంబాలకు 280 ఎకరాల డీకేటీ పట్టాలో వరి వేసుకుంటే ఫారెస్టు అధికారులు అడ్డుపడుతున్నారని సోమశిల ముంపు బాధితులు మొరపెట్టుకున్నారు.

■ ఆల్విన్ ఫ్యాక్టరీ (మూతపడిన) స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని నాగిరెడ్డిపల్లె సర్పంచ్ సూర్యనారాయణ విన్నవించారు. అలాగే నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో గౌతంనగర్, బస్టాండు, వైఎస్సార్ విగ్రహం వద్ద వరదనీటి సమస్య దశాబ్దాలుగా ఉందని వివరించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అర్బన్ ప్రాంతంలో డ్రైనేజీ, రోడ్లకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విన్నవించారు.

తరలివచ్చిన కడప – రేణిగుంట నేషనల్ హైవే బాధితులు

కడప – రేణిగుంట నేషనల్ హైవే బాధితులు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి తరలివచ్చారు. సీకేటగిరి రైతులకు ఇంతవరకు కేంద్రం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. అధికారులు మాత్రం తమ పొలంలో చెట్లు నరికివేయడం, భూములు స్వాధీనం చేసుకుంటున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని బాధితుల తరపున సంఘ సేవకుడు చొక్కరాజు రవీంద్రరాజు, రావిళ్ల ప్రసాద్‌లు జేసీ దృష్టికి తీసుకొచ్చారు.



చిన్నమండెం: అధికారులతో సమీక్షిస్తున్న దేవనాథరెడ్డి

'జగనన్నకు చెబుదాం'ను జయప్రదం చేద్దాం

చిన్నమండెం : ఈ నెల 29వ తేదీన చిన్నమండెం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధ్యక్షతన జరగనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేవనాథరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఈ విషయాన్ని చేరవేయాలన్నారు. దీని వల్ల ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా జిల్లాస్థాయి అధికారులు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరాములునాయక్, ఇంచార్జ్ ఎంపీడీఓ సురేష్‌బాబు, ఎంపీటీసీలు ఏజాజ్ ఆలీఖాన్, శ్యామ్, వెంకటప్పనాయుడు, సర్పంచులు లక్ష్మిరెడ్డి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : త్యాగనిరతికి ప్రతిబింబం మహమ్మద్ ప్రవక్త జీవితమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవ జాతికి ఆదర్శమని బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. సామరస్యం, సోదరభావం, ఇతరుల పట్ల ప్రేమ ప్రవక్త చూపిన మార్గాలని, ఆ మార్గాలలో ప్రజలందరూ నడవాలన్నారు.



జకీయా ఖానమ్

రాయచోటి : ముస్లింలు మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ మయాన జకీయా ఖానమ్ అన్నారు. బుధవారం రాయచోటిలో ఆమె పత్రికలకు అందజేసిన ప్రకటనలో మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ఇస్లాం చివరి ప్రవక్త, ముస్లింలు ఇస్లాంను ఏకేశ్వరోపాసక మతముల ప్రకటనలో చివరిమెట్టుగా భావిస్తారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

గాలివీడు : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ జిల్లా పద్మావతమ్మ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేఖర్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండల వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను అధికారులు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రేపటి భావితరాలకు, ప్రభుత్వ కార్యకలాపాల అవసరాలకు ప్రభుత్వ భూమి మిగలకుండా కబ్జాదారులు ఆక్రమిస్తున్నారని, మరోవైపు పంచాయతీ అనుమతులు లేకుండా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేస్తున్నారని, పంచాయతీ నియమ నిబంధనలు అనుసరించకుండా విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు వెంచర్లు వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంచర్ల ఏర్పాటులో పంచాయతీ అనుమతులు తీసుకుంటే కాలనీలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. రెవెన్యూ వ్యవస్థలో దళారీ తనంతో పాటు సర్వేయర్ వ్యవస్థ చాలా దారుణంగా మండలంలో ఉండడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తప్ప వేరే ఉపయోగం లేదన్నారు. గ్రామ సచివాలయం వ్యవస్థలో ప్రజల సమస్యల పట్ల ఇప్పటికప్పుడు స్పందించి పరిష్కార మార్గం చూపడమే సచివాలయం వ్యవస్థ ధ్యేయమని, కానీ అందుకు భిన్నంగా సచివాలయంలో విధులు నిర్వహించే సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ప్రజాసమస్యలు గాలికి వదిలేశారన్నారు. ప్రజాప్రతినిధులుగా మేము జగనన్న కాలనీ సమస్యలపై అనేకమార్లు హద్దుల కోసం మండల సర్వేయర్‌ను కోరితే ప్రజాప్రతినిధులకు చుక్కలు చూపిస్తున్నారని సభా దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా మండల, గ్రామ సచివాలయాల అధికారుల తీరుమారకుంటే ప్రజాప్రతినిధులందరూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తదుపరి చర్యలకు ఉపక్రమించాల్సి ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఆయా శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన నివేదికలను వివరిస్తూ సభలో ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 శ్రీనివాసులు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రజలకు శ్రీ రామరక్ష



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం కో-ఆర్డినేటర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి అన్నారు. బుధవారం అయన వైద్య,ఆరోగ్య సిబ్బందితో కలసి మాధవరం గ్రామం విలేజీ హెల్త్ క్లినిక్ పరిధిలోని టమటంవారిపల్లెలో ఇంటింటికి తిరుగుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందించే వైద్యసేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సీహెచ్ఓ యస్.షహనాజ్, ఏఎన్ఎం శ్రీవిద్య ఆశ కార్యకర్త గీతారాణి, వలంటీర్ భార్గవి పాల్గొన్నారు.

30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఒంటిమిట్ట మండలంలో ఈ నెల 30 నుంచి ప్రారంభించనున్నట్లు బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డయ్య తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో ఉన్న సచివాలయాల్లో పనిచేసే ప్రతి వలంటీరు, ఏఎన్ఎం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ గురించి ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ వివరాలను తెలియజేశారు. ఈ నెల 30వ తేదీన మంటపంపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో, అక్టోబర్ 3న చింతరాజుపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో, 5న నరవకాటిపల్లి సచివాలయంలో, 7న సాలాబాద్ ప్రైమరీ పాఠశాలలో, 10న రాచగుడిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో, 12న పెన్నపేరూరు సచివాలయంలో, 17న గంగపేరూరు సచివాలయంలో, 19న కొత్తమాధవరం జెడ్పీహెచ్ఎస్‌లో ఉదయం 9:30 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్, డైరీ తప్పనిసరి

సిద్దవటం : అన్నీ పాఠశాలల ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్, డైరీలు తప్పనిరిగా రాయాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట గాంధీ వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ శంకరయ్య, సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, వైఎస్ఆర్ జిల్లా టోఫల్ నోడల్ ఆఫీసర్ డీవీఎస్ ప్రసాద్‌రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో తగిన సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంపొందించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సమయానికి హాజరై జరగవలసిన కార్యక్రమాలను సక్రమంగా జరపాలని సూచించారు. టోఫల్ నోడల్ అధికారి డీవీఎస్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లిష్ ప్రాధాన్యత, ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసిస్తే ఉండే లాభాలు తెలియజేశారు. ఇంగ్లిష్ భాషను చదవడం, రాయడం, వినడం, అర్థం చేసుకోవడం ఎలా అనే అంశాన్ని పిల్లలకు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేయండి

రాయచోటి అర్బన్ : 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరపాలని ఏపీ గ్రామపంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన తమ సంఘం నేతలతో కలసి డీఆర్‌ఓ సత్యనారాయణను కలిశారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ ఆందోళనల ఫలితంగా గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ జిల్లా కలెక్టర్‌లు, డీపీఓలకు ఆదేశాలను జారీ చేశారు. కాగా అన్నమయ్య జిల్లాలో జిల్లా పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కుమ్మక్కై కార్మికులకు జీతాలివ్వకుండా వాటిని పక్కదారి పట్టించారంటూ ఆరోపించారు. అధికారులు కార్మికులకు పూర్తిస్థాయిలో జీతాల చెల్లింపుపై దృష్టిసారించాలని, లేనిపక్షంలో సమ్మెబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయక్, నేతలు రెడ్డెయ్య, ఆంజనేయులు, నాగబసిరెడ్డి, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలు పుస్తకాలు నిర్వహించాలి

రామాపురం : వీఓఏలు వెలుగుకు సంబంధించిన పుస్తక నిర్వహణను కచ్చితంగా చేపట్టాలని మండల ఏపీఎం దేవసేన అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీఓఏల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో దాదాపు 600 వరకు స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయని, వాటికి సంబంధించి దాదాపు 30 మంది పని చేస్తున్నారని, వీఓఏలు ఆయా గ్రామాల పరిధిలోని వెలుగు స్వయం సహాయక గ్రూపుల నిర్వహణ కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఒకొక్క గ్రూపునకు సంబంధించి వారు తీసుకున్న రుణాలు చెల్లింపులు, లావాదేవీలన్నీ పుస్తకంలో పొందుపరచాలని, ఒకొక్క గ్రూపునకు ఒకొక్క పుస్తకం నిర్వహించాలన్నారు. స్వయం సహాయ గ్రూపులకు బ్యాంక్‌లో ఇప్పించే రుణాలు శ్రీనిధి రుణాలు వంటివి సకాలంలో చెల్లించే విధంగా వీఓఏలు కృషి చేయాలన్నారు. అనంతరం స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో సీసీలు ఆదినారయణ, ప్రసాద్, నరసింహులు, నాగభూషన్ రెడ్డి, గ్రామాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చిట్వేలి: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



రాజంపేట: వివిధ క్రీడల్లో జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు



రాజంపేట టౌన్: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు

నందలూరు (రాజంపేట) : రాజంపేట పట్టణంలోని క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికలలో మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను చూపి వివిధ క్రీడలలో జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖోఖో, పరుగు పందెం అండర్-14 విభాగంలో బి.శ్రావణి, పరుగుపందెం, జావలిన్ త్రో అండర్-17 విభాగంలో జి.మల్లికార్జున ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు నాగవరం విద్యార్థులు

చిట్వేలి : నాగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సుజాత తెలిపారు. రైల్వేకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో జరిగిన త్రోబాల్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-17 విభాగంలో హేమంద్, శశివర్దన్, యుగంధర్, రాహుల్, జ్యోత్స్న, కుసుమ కుమారి, అండర్-14 బాలుర విభాగంలో శశికుమార్, లీలాచరణ్, రవితేజ అండర్-14 బాలికల విభాగంలో డిల్లీ ప్రసన్న, హేమలత, అండర్-14 ఖోఖోలో డిల్లీ ప్రసన్న ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ ప్రమీల తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఆకేపాడు విద్యార్థుల ప్రతిభ

రాజంపేట టౌన్ : ఇటీవల రాజంపేటలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని ఆకేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బుధవారం ఆ పాఠశాల హెచ్ఎం సీవీ.రమణయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి ఖోఖోలో ముగ్గురు, కబడ్డీలో నలుగురు, బాల్‌బ్యాడ్మింటన్‌లో ఇద్దరు, అథ్లెటిక్స్ విభాగంలో ఇద్దరు క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పీడీ పెంచలమ్మను అభినందించారు. జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని హెచ్ఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

పుల్లంపేట : ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్ అన్నారు. బుధవారం స్థానిక పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీని రీసర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. జాతీయ రహదారికి సంబంధించి రీసర్వే పూర్తయ్యిందని, రైతులకు సంబంధిత నగదు వారి ఖాతాలలో జమ చేశామన్నారు. పరిహారం అందకుంటే తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సర్వేయర్లు నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ నరసింహ కుమార్ పాల్గొన్నారు.

సర్పంచ్ రాజీనామా

పెనగలూరు : మండలంలోని అనంతంపల్లి సర్పంచ్ పెనిగలపాటి పార్వతి బుధవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. సర్పంచ్ పార్వతి రాజీనామా పత్రాన్ని అందజేస్తూ తనకు ఆరోగ్యరీత్యా సర్పంచ్ పదవికి రాజీనామా చేసినట్లు ఆమె తెలియజేశారు. పార్వతి ఇచ్చిన రాజీనామా పత్రాన్ని తదుపరి చర్యలు నిమిత్తం డీపీఓకు పంపించినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ పద్మభూషన్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తనిఖీ

సిద్దవటం : మండలం లోని జ్యోతి రైతు భరోసా కేంద్రం పరిధిలోని గ్రామాలలో ఈ- పంట నమోదు వివరాలను బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ- పంట నమోదులో రైతుల పేర్లను, ఖాతా నెంబర్, సర్వేనెంబర్, పంట రకం, సాగునీటి వనరులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తేడాలను నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2023 సీజన్‌లో ఈ- పంట నమోదు చేసుకోవడానికి ఈనెల 30వ తేదీ చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు ఓబులేస్, దేవదాసు, రైతు భరోసా కేంద్రం సహాయకులు శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

వరిలో అధికంగా దోమపోటు

పెనగలూరు : మండలంలో వరి కోతకు వస్తున్న సమయంలో సుడిదోమ తీవ్రంగా రైతులకు నష్టం చేస్తోందని వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ తెలిపారు. పెనగలూరులోని పొలాలలో ఈ సుడిదోమ ఉన్నట్లు గమనించినట్లు ఆయన చెప్పారు. పొలం మధ్యలో సుడులు ఎండిపోయినట్లు ఉంటే రైతులు వెంటనే పైమెట్రోజైన్ 50శాతం, డబ్ల్యూజీ 0.6 గ్రాములు పిచికారి చేయాలన్నారు. వరి మొదలులో దోమలు నివాసం ఉండి రసం పీల్చి మొక్క ఎండిపోయేలా చేస్తాయని వారన్నారు. రైతులు మందును పిచికారి చేసేటప్పుడు వరి మొదలు తడిసేలా పిచికారి చేసినట్లెతై వరి ఎండిపోకుండా ఉంటుందన్నారు. ఈ సుడిదోమ వలన రైతులు నష్టపోకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యత



లేగదూడలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఏ రమేష్

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎనిమిది నెలలలోపు లేగదూడల ప్రదర్శనలో భాగంగా శెట్టిగుంటలో లేగదూడల ప్రదర్శన పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి డీఎల్‌డీఏ రమేష్, రాజంపేట డీడీ విజయ్ భాస్కర్ రావులు హాజరయ్యారు. శెట్టిగుంట పరిధిలోని జ్యోతికాలనీ, ఉప్పరపల్లి, కెఆర్ కండ్రిక, వెంకటరెడ్డిపల్లి, లక్ష్మిగారిపల్లి, యానాదిపల్లి గ్రామాలలోని రైతులు తమ లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. 60 దూడలకుపైగా ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి ఉప్పరపల్లికి చెందిన కేశవరెడ్డి, ద్వితీయ బహుమతి కెఆర్ కండ్రిగకు చెందిన శ్రీకాంత్, తృతీయ బహుమతి జ్యోతికాలనీకి చెందిన లాలమ్మ దూడలు దక్కించుకున్నాయి. డీఎల్‌డీఏ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఏడీలు సురేష్ రాజు, కేడీ ప్రసాద్, వైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్, నాగ శిరీష, సిబ్బంది విజయలక్ష్మి, బ్రహ్మణి, ధనుంజయ, హరిచరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


వాటర్ షెడ్ నిధులతో గ్రామాల అభివృద్ధి



ఫాం పాండ్ పనులను ప్రారంభిస్తున్న నాయకులు, రైతులు

లక్కిరెడ్డిపల్లె : గ్రామాల అభివృద్ధికి వాటర్ షెడ్ నిధులు దోహదం చేస్తాయని ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, వాటర్ షెడ్ చైర్మన్ మల్రెడ్డి, సచివాలయం కన్వీనర్ శంకర్ రెడ్డిలు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ బి.యర్రగుడి గ్రామానికి వాటర్ షెడ్ ద్వారా రూ. కోటి40 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిధులతో గ్రామంలో చెక్ డ్యాముల నిర్మాణం, గల్లికట్టలు, వ్యవసాయ భూములలో రాళ్లు వేరడం వంటి పనులు చేపడతామని తెలిపారు. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే వాటర్ షెడ్ నిధుల మంజూరు చేయించడంలో సహకరించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి. ఎంపీపీ ఎం. సుదర్శన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిల సహకారంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ అధికారులు నరసింహారెడ్డి, దామోదర్ రెడ్డి, వైఎస్సార్ సిపి సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, శివ మల్లినాయుడు, నరసింహారెడ్డి, శివకుమార్ రెడిడ, రామస్వామి, గోపాల్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు చేపట్టనివారికి నోటీసులివ్వండి



అధికారులతో సమీక్షిస్తున్న కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి

సిద్దవటం : పక్కా గృహాల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో బుధవారం పక్కాగృహాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి మాట్లాడుతూ మండల టీమ్ సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులతో పక్కాగృహాలను నిర్మించాలన్నారు. ఏ సచివాలయం పరిధిలో లక్ష్యం ఇచ్చామో అక్కడే అధికారులు నివాసం ఉండి పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. పక్కాగృహాల లక్ష్యాలను పూర్తి చేయని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డికి ఆదేశించారు. తహసీల్దారు లక్ష్మిదేవి, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య తదితరులున్నారు.

పర్యాటక కేంద్రాలను కాపాడుకుందాం

ఒంటిమిట్ట : దేశంలో అత్యున్నత సంపదైన పర్యాటక కేంద్రాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా పర్యాటక సిబ్బంది రాంకుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని హరితా హోటల్ మేనేజర్ కిశోర్ ఆధ్వర్యంలో హరితా హోటల్ వద్ద నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయం వద్దకు పలు పాఠశాల, కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. ఆలయ పరిసరాలలో ఉన్న చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కడప డివిజన్ పర్యాటక సిబ్బంది జాషువ, ఈశ్వరయ్య, శ్రీధర్, కడప కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, కోటిరెడ్డి ఉమెన్స్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.